క్లుప్తంగా

జల వనరులను సంరక్షించుకోవాలి



రాజోలు బాలికోన్నత స్కూలులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

రాజోలు: జల వనరులను సంరక్షించుకోవాలని ఎంఈఓ నల్లి మనోహరం అన్నారు. గురువారం బి.సావరం ఎంపీపీ పాఠశాల, రాజోలు బాలికోన్నత పాఠశాలలో జల పొదుపుపై అవగాహన సదస్సు జరిగింది. మానవాళి మనుగడకు నీరు ఎంతో దోహదం చేస్తుందన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. మానవ చర్యలతో భూగర్భంలో ఉన్న నీరు పూర్తిగా కలుషితంగా మారిపోతుందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సచివాలయం ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ–2 ప్రసాదరావు, హెచ్ఎం కె.శకుంతల, ఎం.సుమతి తదితరులు పాల్గొన్నారు.

డ్రైన్లు, పంట కాలువలకు మరమ్మతులు



మలికిపురం సమావేశంలో మాట్లాడుతున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: వచ్చే సార్వా సాగుకు అనుకూలంగా డ్రైనేజీ, పంట కాలువల మరమ్మతులను వేగంగా చేయిస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం రాజోలు, మామిడికుదురు మండలాల కూటమి పార్టీ నాయకులతో మలికిపురంలో ఆయన సమీక్ష నిర్వహించారు. అందరి సమష్టి కృషితో విజయం సాధించామని అన్నారు. ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలన్నీ త్వరలో నెరవేర్చడంతో పాటు ప్రజాభీష్టం మేరకు పాలన సాగిస్తామన్నారు. మంచినీటి కొరత, డ్రైనేజీ, కొబ్బరి రైతుల సమస్యలు, పంటకాలువల పూడిక, రోడ్స్, ప్రాధాన్యతా క్రమంలో అన్ని పరిష్కరిస్తానని, సమస్యలను పేపర్‌పై రాసి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోకా పార్వతి, జగడం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎనీమియాపై అవగాహన అవసరం



పాశర్లపూడిలో సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

మామిడికుదురు: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెల్త్ అసిస్టెంట్ కేవీ సూర్యనారాయణ సూచించారు. పాశర్లపూడి కొట్టుమెరకలో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ కార్యక్రమంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, కళ్లు పసుపు రంగలోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వారు వెంటనే ప్రభుత్వ డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఇందిర, ఏఎన్ఎం భూలక్ష్మి, ఆశ కార్యకర్త వెంకటలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

మామిడికుదురు: ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను పరష్కరించేందుకే ప్రభుత్వం ప్రతి ఏటా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తోందని తహసీల్దార్ ఎం.మేరికమ్మ పేర్కొన్నారు. మామిడికుదురు గ్రామ పంచాయతీ వద్ద గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. రెవెన్యూ పరమైన అన్ని సమస్యలను ఈ సదస్సుల ద్వారా పరిష్కరిస్తామన్నారు. ప్రతి గ్రామంలో సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని, వారి వద్దకే వచ్చి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. ఈ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ శరణ్య, వీఆర్వోలు వెంకటేశ్వర రావు, శ్రీనివాస్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



మామిడికుదురు సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ మేరికమ్మ

శిథిల వంతెనలు పునర్నిర్మించాలి

- ప్రకాశపురం, శృంగవరప్పాడుల్లో పాడైన వంతెనలు
- మూడు దశాబ్దాల క్రితం నిర్మాణం
- పెచ్చులు ఊడి ఊచలు తేలిన వైనం



అంతర్వేదికర శివారు ప్రకాశపురం వద్ద డ్రెయిన్‌పై శిథిల స్థితికి చేరిన వంతెన



శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం మధ్య డ్రెయిన్‌పై శిథిల స్థితికి చేరిన వంతెన

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రానికి సఖినేటిపల్లి మూడు తూములు సెంటర్ నుంచి వెళ్లే రహదారిలో అంతర్వేదికర శివారు ప్రకాశపురం వద్ద డ్రెయిన్‌పై శిథిల వంతెన స్థానే కొంత వంతెన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం మధ్య మరో డ్రెయిన్‌పై శిథిల వంతెన స్థానే కొత్త వంతెన నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ప్రకాశపురంలో...

మండలంలోని అంతర్వేకర గ్రామ శివారు ప్రకాశపురంలోని ప్రధాన రహదారిలో డ్రెయిన్‌పై సుమారు మూడు దశాబ్దాల క్రితం వంతెనను నిర్మించారు. గతంలో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వంతెనకు దెబ్బ తిన్న కాంక్రీట్ దిమ్మలకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేశారు. సఖినేటిపల్లి మూడు తూములు సెంటర్ నుండి అంతర్వేదిపాలెం, గొంది, అంతర్వేదికర మీదుగా అంతర్వేది పుణ్యక్షేత్రానికి పోవు రహదారిలో ప్రకాశపురంలో డ్రెయిన్‌పై దీనిని గతంలో నిర్మించారు. సుమారు ఆరు గ్రామాల ప్రజలకు, వివిధ ప్రాంతాల భక్తులకు నాటి నుంచి ఈ వంతెన ఉపయోగంగా ఉంది.

శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం మధ్య..

మండలంలోని శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం మధ్య డ్రెయిన్‌పై సుమారు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన పూర్తి శిథిల స్థితికి చేరింది. వంతెన తాలూకు శ్లాబ్ అడుగున పెచ్చులూడుతూ డ్రెయిన్‌లో విరిగి పడుతున్నాయి. దీంతో శ్లాబ్ అడుగు భాగం మొత్తం దెబ్బతిని ఇనుప ఊచలు బయట పడ్డాయి. మలికిపురం నుంచి మోరి, శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం మీదుగా తీర ప్రాంత గ్రామాలకు వెళ్లడానికి ఈ వంతెన నాటి నుంచి ఉపయోగంగా ఉంది.

ప్రాధాన్యం కలిగిన వంతెన

ప్రకాశపురం వద్ద ఉన్న ఈ వంతెనకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అంతర్వేది పుణ్యక్షేత్రానికి వాహనాల్లో వెళ్లే ప్రయాణికులకు ఈ వంతెన ఎంతో కీలకం. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన పూర్తిగా దెబ్బతింది. కొత్త వంతెన నిర్మించాలి.

– పోతురాజు నాగేంద్ర కుమార్, అంతర్వేదికర

ప్రమాదకరంగా వంతెన పరిస్థితి

శృంగవరప్పాడు, కేశవదాసుపాలెంకు గ్రామాల మధ్య డ్రెయిన్‌పై ఈ వంతెన ఉంది. మూడు దశాబ్దాల క్రితం ఈ వంతెన నిర్మించారు. వంతెన శ్లాబ్ అడుగున పెచ్చులూడుతూ, ఇనుప ఊచలు బయటపడి ప్రమాదకరంగా ఉంది. ఏ క్షణాన ఏ ముప్పు ముంచుకొస్తుందోనని భయంగా ఉంది.

– ఉందపల్లి రామకృష్ణ, కేశవదాసుపాలెం

ప్రతిపాదనలు పంపాం

డ్రెయిన్‌లపై రెండు చోట్ల వంతెనల పునర్నిర్మాణం పనులకు రెండింటికీ ప్రతిపాదనలు చేశాం. అంతర్వేదికర శివారు ప్రకాశపురం వంతెనకు రూ.కోటి 20 లక్షలు, శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం మధ్య మరో వంతెనకు రూ.కోటి 50 లక్షలు ప్రతిపాదనలు పంపించాం.

– సురేష్, ఆర్అండ్‌బీ, జేఈ, రాజోలు

ఖరీఫ్ నారుమడుల పరిశీలన



కడలిలో నారుమడి పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ నందకిషోర్

రాజోలు: ఖరీఫ్ నారుమడులను ఏరువాక జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ గురువారం పరిశీలించారు. మండలంలోని కడలి, కూనవరం గ్రామాల్లో పర్యటించి 2024 ఖరీఫ్ వరి నారుమడుల సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. నారుమడి వేసుకునే భూమిని మూడు దఫాలుగా దమ్ము చేసి చదును చేసుకోవాలన్నారు. ముఖ్యంగా నారుమడిలోకి సాగునీరు లోపలకు, బయటకు వెళ్లే విధంగా చిన్న చిన్న కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఐదు సెంట్లు నారుమడి సిద్ధం చేసుకునేందుకు ఐదు కేజీల యూరియాకు ఒక కిలో భాస్వరం కలిపి మొత్తం ఆరు కిలోల ఆరు కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్, రెండు కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువు వేయాలన్నారు. ప్రతి ఐదు సెంట్ల భూమికి 25 కేజీల విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తన శుద్ధి చేసి మొలక కట్టాలన్నారు. కూనవరంలోని వరి నారుమడులను పరిశీలించి రైతు ఉప్పు వీరభద్రరావుకు కొత్త వరి వంగడం ఎంటీయూ–1310 విత్తనాలను 20 కేజీలు అందజేశారు. అలాగే ఎంటీయూ–1318, ఎంటీయూ–7029(స్వర్ణ) రకాల వరి విత్తనాలను అందజేసి విత్తనాభివృద్ధి చేపట్టాలన్నారు. మండల వ్యవసాయాధికారి మధుకుమార్, వీఏఏలు బీసీఆర్‌కే రాజు, శివరామకృష్ణ, వీహెచ్ఏ ఉమ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అంబాజీపేటలో రిటైర్డ్ వీఆర్వోలను సత్కరిస్తున్న తహసీల్దార్ విమలకుమారి, జెడ్పీటీసీ వరలక్ష్మి

అంబాజీపేట: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, తహసీల్దార్ జె.విమలకుమారి అన్నారు. అంబాజీపేట మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవ కార్యక్రమాన్ని తహసీల్దార్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సేవలపై అవగాహన కలిగి ఉంటే వారి సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్లు అందుబాటులో ఉంటున్నారని భూమికి సంబంధించినవి గాని, ధ్రువీకరణ పత్రాల కోసం వారు అందుబాటులో ఉంటారన్నారు. రెవెన్యూ పరిధిలోని సమస్యలుంటే కార్యాలయంలో సంప్రదిస్తే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఇరువురు వీఆర్వోలను, చైన్ మాన్‌ను తహసీల్దార్, సిబ్బంది దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం రైతులకు అడంగల్ 1బి, విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీటీ పి.నాగపద్మలక్ష్మి, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో నేడు విద్యుత్ అంతరాయం

పి.గన్నవరం: కొత్తపేట నుంచి నరేంద్రపురం 33 కేవీ సబ్‌స్టేషన్‌కు వచ్చే లైనులో చెట్ల కొమ్మలు, ఆకులు తొలగించే పనులు నిర్వహిస్తున్న కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ఆనందరాజు తెలిపారు. కారణంగా పి.గన్నవరం మండలంలోని నరేంద్రపురం, రాజులపాలెం, పప్పులవారిపాలెం, కుందాలపల్లి, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం, ఊడిమూడి, ఊడిమూడిలంక, జి.పెదపూడి, జి.పెదపూడిలంక పశ్చిమగోదావరి జిల్లా పెదమల్లంక, అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ ఆనందరాజు విజ్ఞప్తి చేశారు.

కొత్తపేట: మండలంలో పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు. స్థానిక 33 కేవీ విద్యుత్ లైన్ ట్రీ కటింగ్ చేసే నిమిత్తం బిళ్లకుర్రు, వానపల్లి, వాడపాలెం, కొత్తపేట, అవిడి, ఖండ్రిగ గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

మామిడికుదురు: నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని తొమ్మిది గ్రామాలు, రాజోలు మండలం తాటిపాక గ్రామంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవి కుమార్ గురువారం తెలిపారు. నగరం సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ స్తంభాల తొలగింపు చర్యల్లో భాగంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. నగరం, మామిడికుదురు, పాశర్లపూడి, పాశర్లపూడి లంక, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, అప్పనపల్లి, పాశర్లపూడిలంక, లూటుకుర్రు శివారు బాడిలంక, తాటిపాక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రెవెన్యూ ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు







అమలాపురంలో కలెక్టర్ హిమాన్షుశుక్లా నుంచి అవార్డు అందుకుంటున్న డీటీ ప్రసూన, ఎస్ఏ అర్జమ్మ, వీఆర్ఏ బాలు

కొత్తపేట: రెవెన్యూ దినోత్సవం సందర్భంగా మండలంలోని ముగ్గురు ఉద్యోగులు ‘ఉత్తమ ఉద్యోగి’ అవార్డులు అందుకున్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డీఓ) కార్యాలయంలో డీటీగా పని చేస్తున్న ఎస్ఎస్ఆర్ఎస్ ప్రసూన, మండల రెవెన్యూ కార్యాలయంలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బి.అర్జమ్మ, మండలంలోని పలివెల గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్ఏ)గా పనిచేస్తున్న పి.దుర్గాప్రసాద్ (బాలు) ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. వారు గురువారం అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన రెవెన్యూ దినోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షుశుక్లా చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు కింద సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ ఉత్తమ ఉద్యోగ అవార్డు గ్రహీతలను ఆర్‌డీఓ జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ ఎలీషా, ఎంఆర్ఐ కె.ఏడుకొండలు, ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బంది అభినందించారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం తహసీల్దార్ ఎం.వెంకట్రామయ్య అధ్యక్షతన రెవెన్యూ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 400 సంవత్సరాల వైభవం కలిగిన రెవెన్యూ శాఖ ప్రాముఖ్యత, ఆవశ్యకతను వివరించారు. అనంతరం రెవెన్యూ శాఖలో విశిష్ట సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన రిటైర్డ్ తహసీల్దార్ జల్లి కేశవరావుతో పాటు అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ భవానీ, వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలపై విస్తృత అవగాహన

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి రెవెన్యూ సేవలపై అనునిత్యం ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్ అన్నారు. మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా జరిగింది. అందులో భాగంగా మండలంలోనున్న 15 రెవెన్యూ డివిజన్ల పరిధిలో రెవెన్యూ డేలను నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ పరంగా ప్రజలకు అందించవలసిన సేవలను తహసీల్దార్ అనిల్‌కుమార్ వివరించారు. భూ వ్యవహారాలు, అడంగల్, 1బీ, కుల, ఆదాయ తదితర ధృవీకరణ పత్రాలు మంజూరు, నీటి పన్ను వసూళ్లతో సహా పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఇటీవల పదవి విరమణ పొందిన జొన్నాడ–1 గ్రామ రెవెన్యూ అధికారి చాపల సూర్యనారాయణ, సత్యవతి దంపతులను ఘనంగా సత్కరించి మెమొంటోను బహూకరించారు. డీటీలు కె.విజయ, ఎం.జానకి రాఘవ, ఎంఎస్‌ఓ టి.సుబ్బరాజు, ఏఎస్‌ఓ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వికసించిన పుష్పాలు



మూలస్థాన అగ్రహారం వద్ద 216 ఏ జాతీయ రహదారిలో నెల రోజుల క్రితం మోడు వారిన తురాయి చెట్లు (నాడు)



మూలస్థాన అగ్రహారం వద్ద వికసించి అందాలు విరబూస్తున్న తురాయి చెట్లు (నేడు)

ఆలమూరు: మృగశిర కార్తె ప్రారంభం కావడంతో గ్రీష్మ ఋతువు వచ్చేసింది. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. నాడు మోడు వారిన చెట్లు నేడు పచ్చని ఆకులు, రంగు రంగుల పుష్పాలతో చూడ ముచ్చటగా చూపరులకు ఇంపును కలిగిస్తున్నాయి. మోడు వారిన జీవితాలు ఎన్నడూ అలాగే ఉండవని, వికసించక మానవు అనే సూక్తిని నిజం చేస్తూ 216 ఏ జాతీయ రహదారిలోనిమూలస్థాన అగ్రహారం వద్ద తురాయి చెట్లు నిరూపిస్తున్నాయి. అక్కడ నాడు మోడు వారిన తురాయి చెట్లు వాతావరణ పరిస్థితుల ప్రభావంతో నేడు చక్కటి పూలవనాలయ్యాయి. వేసవికాలం ధాటికి నెల రోజుల క్రితం చెట్లు అంతా ఎండిపోయి కళావిహీనంగా మారింది. మానవ జీవితానికి ఈ చెట్లు దగ్గరగా ఉన్నట్లు భావించాల్సిన అవసరం ఎంతైన ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఆత్రేయపురం: గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబా అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు 21వేల పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ వరప్రసాద్ వివరించారు. అలాగే వివిధ శాఖల అధికారులతో ఎంపీడీఓ సమీక్షించారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయని, సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధర్మోజీరావు సేవలు చిరస్మరణీయం

రాజోలు: సాహిత్యరంగంలో కవి గుర్రం ధర్మోజీరావు అందించిన సేవలు చిరస్మరణీయమని దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఇసుకపట్ల రఘుబాబు అన్నారు. గురువారం తాటిపాకలో దళిత చైతన్య వేదిక ఆధ్వర్యంలో మండల ఉపాధ్యక్షుడు పొలమూరి శ్యాంబాబు అధ్యక్షతన ధర్మోజీరావు సంస్మరణ సభ జరిగింది. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, గుర్రం ధర్మోజీరావు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రఘుబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు ధర్మోజీరావు రచనలు ఎంతో దోహదం చేశాయన్నారు. వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులు 15 మందికి డాక్టర్ గుర్రం ధర్మోజీరావు స్మారక పురస్కారాలను దళిత చైతన్య వేదిక ప్రదానం చేసి సత్కరించింది. దళిత చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల మురళీకృష్ణ, సమన్వయ కర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టును ప్రాణపదంగా భావించాలి

సఖినేటిపల్లి: ప్రతి నీటి బొట్టును ప్రాణపదంగా భావించాలని ఏపీ ఎన్జీసీ స్టేట్ మానటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి అన్నారు. గురువారం సఖినేటిపల్లిలంకలో విద్యార్థులకు, గ్రామస్తులకు సేవ్ వాటర్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ ఎన్జీసీ, ఏపీ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరుగుచున్న ఏడు రోజులు షెడ్యూల్‌లో భాగంగా ఏడవ రోజు పై కార్యక్రమం ఆమె చేపట్టారు. పాఠశాలల్లో, గృహాల్లో నీటి దుర్వినియోగం అరికట్టాలని ఆమె సూచించారు. అలాగే వాటర్ లీకేజీలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి పాఠశాలల్లోను విద్యార్థులకు నీటి ఆవశ్యకత గురించి తెలియజేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి నీటిని పొదుపు చేయండి, సహజ వనరులను కాపాడండి, నీరు మానవాళికి జీవనాధారం, నీటిని వృథా చేయవద్దు అంటూ నినాదాలు చేయిస్తూ ర్యాలీ నిర్వహించారు. రేపూరి ఏసు నరసింహ రాజా, విద్యాకమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మమ్మ జాతర



కనకమహాలక్ష్మి అమ్మవారు

రావులపాలెం: ఊబలంక గ్రామ దేవత కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జాతర పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని చిన్న పిల్లలతో దివిటీలు(కాగడాలు) వేయించి మొక్కు తీర్చుకున్నారు. అమ్మవారి గరగలతో పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాండ్‌మేళాలు, గరగనృత్యాలు, విచిత్ర వేషధారణలతో అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద బాణసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అలాగే టౌన్ సీఐ జేమ్స్ రత్నప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిధుల దుర్వినియోగంపై నేడు విచారణ

ఆలమూరు: మండలంలోని పెనికేరు, ఆలమూరు–1 డివిజన్ పరిధిలో వెలుగు రుణాల దుర్వినియోగం ఆరోపణలపై శుక్రవారం విచారణ జరగనుంది. జిల్లా డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్ నుంచి ఆదేశాలు వెలువడినట్లు ఏపీఎం ఎం.ధనరాజు తెలిపారు. జిల్లా నుంచి ప్రత్యేక అధికారులు విచ్చేసి ఆరెండు గ్రామాల పరిధిలో డ్వాక్రా సభ్యుల సమక్షంలో విచారణ జరపనున్నారు.

కేశనపల్లి వెస్ట్–38 బావిలో సాంకేతిక లోపం

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెం సముద్ర తీరంలోని కేశనపల్లి వెస్ట్–38 ఓఎన్జీసీ ఆయిల్ కం గ్యాస్ బావిలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో గత కొన్ని రోజులుగా బావి నుంచి గ్యాస్ రాకుండా మొరాయించింది. దీంతో గురువారం నుంచి తూర్పుపాలెంలోని జీసీఎస్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ 38 నంబర్ బావితో పాటు మరొక ఆరు బావులు కూడా ఉన్నాయి. కేశనపల్లి వెస్ట్ స్ట్రక్చర్ పరిధిలో అత్యధికంగా గ్యాస్ ఉత్పత్తి జరుగున్న బావులు ఇక్కడే ఉన్నాయి. గత రెండేళ్ల క్రితం ఇక్కడ మరమ్మతులు కారణంగా భారీ ఎత్తున గ్యాస్ ఆయిల్ లీకై పెనుప్రమాదం తప్పింది. దీంతో అప్రమత్తం అయిన ఉన్నతాధికారులు ఈ సారి అధునాతన పరికరాలు, యంత్రాలు తెచ్చి ఇక్కడ బావులను మరమ్మతులు చేస్తున్నారు.

నేను బడికి పోతా ర్యాలీ

పి.గన్నవరం: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ కోన హెలీనా అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆర్.ఏనుగుపల్లి గ్రామంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెలీనా మా ట్లాడారు. పిల్లల తల్లిదండ్రులను కలుసుని ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సీహెచ్ వీరభద్రం, ఆర్.ఏనుగుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.చిరంజీవి, సీఆర్ఎంటీ ఎం.అర్జున్, ఆదిబాబు, ఎం.అనూషదేవి, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విప్పర్తికి పార్టీ నేతల పరామర్శ



జెడ్పీ చైర్మన్ విప్పర్తి సోదరుడు రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

అంబాజీపేట: సోదర వియోగంతో బాధపడుతున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావును అంబాజీపేట వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. వేణుగోపాలరావు అన్న చిట్టి రామారావు ఇటీవల మృతి చెందడంతో ధవళేశ్వరంలోని ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం చిట్టి రామారావు చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దొమ్మేటి సత్య మోహన్, జక్కంపూడి తాతాజీ, జక్కంపూడి వాసు, బీర సురేష్, నేలపూడి సాయిబాబు, నేలపూడి సుందరయ్య తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

మామిడికుదురు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ యోగా గురువు ఆకుల ఖేతన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా గురువారం మామిడికుదురు నుంచి నగరం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు ఖేతన్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఒత్తిడి దూరమవుతుందని, దీర్ఘ కాలిక రోగాల నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. దీంతో పాటు బీపీ, సుగరు నియంత్రణలో ఉంటాయని చెప్పారు.

నామినేటెడ్ కమిటీలు నియమించాలని వినతి

సఖినేటిపల్లి: రాష్ట్ర చేనేత, టెక్స్‌టైల్స్ మంత్రి ఎస్.సవితను గురువారం అమరావతిలో మోరి చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర టీడీపీ చేనేత విభాగం ఉపాధ్యక్షుడు చింతా వీరభద్రేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయన ఒక వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. సొసైటీలకు అనధికార నామినేటెడ్ కమిటీలను నియమించి, చేనేత కార్మికుల ఉపాధి అవకాశాలను కాపాడాలని, చేనేత సొసైటీలకు ప్రభుత్వం బకాయి పడిన సొమ్మును వెంటనే చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆ పత్రంలో ఆయన కోరారు. ఆయన వెంట జాన పార్వతీశం, మోటూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

24న ఎమ్మెల్యే గిడ్డి విజయోత్సవ ర్యాలీ

పి.గన్నవరం: స్థానిక ఎమ్మెల్యేగా గిడ్డి సత్యనారాయణ గెలుపొందిన నేపథ్యంలో ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండలంలోని జి.పెదపూడి గ్రామం నుంచి విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ నామన రాంబాబు తెలిపారు. పి.గన్నవరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కూటమి పార్టీల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ర్యాలీ అనంతరం పోతవరం హోండా షోరూమ్ పక్కన లేఅవుట్‌లో విజయోత్సవ సభ జరుగుతుందని ఆయన వివరించారు. పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.